ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టు..

- వేసవిలో నీటి ప్రాధాన్యతను గుర్తించాలి
- రోజుకు నాలుగు లీటర్ల నీటిని తాగాలంటున్న వైద్యులు
- సురక్షితమైన నీటి సరఫరాకు ప్రభుత్వం కృషి
- రెండు నియోజకవర్గాల్లో వేసవి ముందస్తు చర్యలు



నేలటూరులో వాటర్ ట్యాంకు

కపిలేశ్వరపురం: వేసవి సమీపించగానే చేతిపంపుల్లో నీటి ధార మందగిస్తుంది. చెరువులు ఎండి నీటిమట్టం అడుగంటుతుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని గ్రామాల వెంబడి గోదావరి నదిలోనూ నీరు ఆవిరై ఇసుకతిన్నెలు దర్శనమిస్తున్నాయి. ప్రతి వేసవిలోనూ ప్రకృతి సహజసిద్ధమైన ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టుకోవాలి. భద్రంగా సద్వినియోగం చేసుకోవాలి. నీటిని వృథా అలవాటును మానుకోవాలి. రెండు నియోజకవర్గాల్లో నీటి లభ్యత, వినియోగం, వేసవి ముందస్తుకు ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలపై కథనం...

ఇదీ తాగునీటి ప్రాధాన్యత

శరీరంలో జీవ క్రియలన్నీ నీటివల్లనే జరుగుతాయి. శరీరం నుంచి బయటకు పోయిన స్రావాలను నీరు, ఖనిజ లవణాలతో భర్తీ చేసుకోవాలి. రోజువారీ జీవితం నీటిని తాగడంతోనే ప్రారంభం కావాలి. నీరు తక్కువ తాగిన వాళ్లు డీహైడ్రేషన్‌కు గురై తలనొప్పి, అలసట, నిస్సత్తువ, బీపీ తగ్గడం, మెదడుకు సరిగా ఆక్సిజన్ అందకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటారు. శరీరంలోని ఉష్ణోగ్రత స్థిరంగా ఉండటానికి తగినన్ని నీళ్ళు అవసరమని గుర్తించాలి. మనిషితోపాటు పశు,పక్షాదులకు సైతం నీటి అవసరం వేసవిలో మరింత ఎక్కువ ఉంటుంది.

ఒక్కొక్కరికి రోజుకు 125 లీటర్లు

వేసవి తాపం నుంచి పరిష్కారం పొందేందుకు తగినంత నీటికి తాగాల్సిందే. ఒక మనిషి అన్ని అవసరాలు తీర్చుకునేందుకు రోజుకు 125 లీటర్ల నీటిని వినియోగిస్తాడన్నది ఒక అంచనా. అయితే వేసవిలో నీటి లభ్యతలో అనేక సమస్యలుంటాయి. భూగర్భజలాలు అడుగంటడం, విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వేసవిలో సహజ పరిణామాలు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి నీటిబొట్టునూ పొదుపుగా వాడుకోవడం జీవన విధానంగా మారాలి.

ప్రభుత్వం ముందస్తు చర్యలు

ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. రామచంద్రపురం డివిజన్‌పరిధిలోని 9 మండలాల్లో 49 మేజర్, 102 మైనర్ మొత్తం 151 పంచాయతీలు ఉన్నాయి. ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఏఈలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం సమావేశమై సమీక్షిస్తున్నారు. ప్రతి 15 రోజులకొకసారి వాటర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేస్తున్నారు.

దినచర్య తాగునీటితో ప్రారంభం కావాలి



ఉదయం లేవగానే కనీసం రెండు గ్లాసుల సురక్షిత నీటిని తాగాలి. రోజు మొత్తంలో మూడు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగాలి. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా రెండు, రెండు గ్లాసుల చొప్పున తాగాలి. ఆహారం తీసుకోవడానికి అరగంట ముందు, తీసుకున్నాక రెండు గంటల తర్వాత మాత్రమే నీటిని తాగాలి. ఇప్పటి వరకూ క్రమబద్ధంగా నీటిని తాగడం అలవాటు లేనివారు నీటిని తాగుతున్నపుడు వికారం, వాంతి అవుతున్నట్టు అనిపిస్తుంది. భయపడాల్సిన అవసరంలేదు. అలవాటు చేసుకోవడం ద్వారా నీటిని తాగాల్సిందే.

– డాక్టర్ కరుణేంద్రకుమారి, అచ్యుతాపురం పీహెచ్‌సీ

వాటర్ ట్యాంకులు సిద్ధమయ్యాయి



డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో నూతన వాటర్ ట్యాంకులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలోని టేకి, కోరుమిల్లిలలోని ట్యాంకుల ద్వారా త్వరలోనే నీటి సరఫరా చేస్తాం. మాచర గ్రామ శివారు తోడిగుడ్లపాడులోని వాటర్ ట్యాంకు ఏప్రిల్‌లో సిద్ధమయ్యే అవకాశం ఉంది. పడమర ఖండ్రికలో 4, వడ్లమూరులో 3, టేకి 1 చేతిపంపులు వేశాం. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి పథకం పనులు జరుగుతున్నాయి. కపిలేశ్వరపురంలో 2, వాకతిప్ప, నారాయణలంక, పడమర ఖండ్రికలలో ఒక్కొక్కటి చొప్పున ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు ప్రతిపాదన దశలో ఉన్నాయి.

– ఎం.రామకృష్ణారెడ్డి, డీఎల్‌పీఓ, రామచంద్రపురం డివిజన్

నియోజకవర్గంలో రూ.40 కోట్లతో రోడ్ల అభివృద్ధి



ద్రాక్షారామ ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించిన మంత్రి వేణు తదితరులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో రూ.40 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేపట్టినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. దీనిలో భాగంగా మండలంలోని ద్రాక్షారామ ప్రధాన రహదారి నిర్మాణ పనులను మంగళవారం మంత్రి వేణు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నాటికి నియోజకవర్గంలో రూ.40 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. ద్రాక్షారామ ప్రధాన రహదారి రామచంద్రపురం పట్టణ శివారు పెద్ద వంతెన నుంచి వేగాయమ్మపేట చివరి వరకు 7.2 కిలోమీటర్ల దూరం రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి సుజాత, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, సర్పంచ్‌లు కొత్లపల్లి అరుణ, కట్టా గోవిందు, అనిశెట్టి రామకృష్ణ, అంబటి తుకారం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు అంగరలో ఆసరా చెక్ అందజేత

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని థియేటర్ సెంటర్‌లో బుధవారం వైఎస్సార్ ఆసరా పథకం రుణమాఫీ చెక్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందజేస్తామని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, నల్లూరు గ్రామాల మహిళా సంఘాలకు ఈ చెక్ అందజేస్తారన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యుత్ స్తంభాలు వేయాలి



స్తంభాల ఏర్పాటు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

కె.గంగవరం: జగనన్న కాలనీల్లో ప్రణాళికబద్ధంగా విద్యుత్ స్తంభాలు వేయాలని ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ సూచించారు. మండలంలోని దంగేరు ఎస్సీ కాలనీ వద్ద జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వారు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పెద్ద లే అవుట్ కావడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందుగానే ప్రణాళిక ద్వారా స్తంభాలు వేయాలని సూచించారు. త్వరంలో ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ ప్రభుత్వం అందిస్తుందని లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప సర్పంచ్ దార సత్యనారాయణ, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా గ్రామాల్లో సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ వేగి వెంకటసుబ్బారావు (శ్రీను) అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా కేవలం పంట రుణాలు మాత్రమే కాకుండా గోల్డ్ లోన్, రైతుల భూమి అభివృద్ధికి, గృహనిర్మాణాలకు, వాహనాల కొనుగోలుకు రుణ సదుపాయాలను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించటంతో పాటు పీఏసీఎస్‌ల ద్వారాను అనేక సహకారాలు అందిస్తోందని రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పుల్లెపు వాడపల్లి, సంఘ సభ్యులు సున్న లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనివాస్, డీవీ రమణ పలువురు రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు 'పల్లి' మృతి



పల్లి సత్యనారాయణ (ఫైల్)

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లి సత్యనారాయణ (58) మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. వైఎస్సార్ పట్ల అభిమానంతో ఆయన పేరున నిర్వహించిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే వారు. ఆయన మృతికి ఆ పార్టీ గ్రామ కార్యదర్శి కట్టా మురళి, దళిత సంఘాల నాయకులు మల్లిపూడి శివకుమార్, పిప్పర సంపతరావు, పీతల శ్రావణకుమార్, బొకే సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు.

సీతారాముల బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న మాలధారులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలోని సీతారామచంద్ర స్వామి వారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా మొదలయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల కోసం అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు స్వామివారి దీక్షలు చేపట్టారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణం జరగనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పామర్రు హైస్కూల్ క్రీడా ప్రాంగణానికి మహర్దశ

- నడుం బిగించిన పూర్వ విద్యార్థులు
- రూ.5 లక్షలు మంజూరు చేసిన మంత్రి వేణు



పామర్రులోని పాఠశాల క్రీడా మైదానం

కె.గంగవరం: నియోజకవర్గ స్థాయిలో ఎక్కడా లేని విధంగా పామర్రు హైస్కూల్ ఆట స్థలం తొమ్మిది ఎకరాల్లో విశాల మైదానంలో విస్తరించి ఉంది. పాఠశాల ప్రారంభమైన 1949 నుంచి ఇప్పటి వరకు విశాలమైన ఆట స్థలం ఉన్నా నిరుపయోగంగా గోతులతో ఉండడంతో విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఇబ్బంది పడ్డారు. అయితే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు క్రీడా స్థలం అభివృద్ధి చేయాలని నడుం బిగించారు. అనుకున్నట్లుగానే 1949 నుంచి పాఠశాలలో చదివి పూర్వ విద్యార్థులందరూ ఒకే తాటిపైకి తీసుకువచ్చి క్రీడా స్థలం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఇప్పటికే సుమారు 1000 మంది పూర్వ విద్యార్థులను ఒకేతాటిపైకి తీసుకువచ్చారు. క్రీడా స్థలం అభివృద్ధికి తమ వంతు సాయం కావాలని కోరగా సుదూరు ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, స్థానికంగా ఉద్యోగాలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు విరాళాలు అందించడంతో ఆట స్థలం అభివృద్ధి ప్రారంభించారు. ఇప్పటికే 25 లారీల పూసకంకర వేయించి క్రీడా మైదానాన్ని చదును చేసే పని చేపట్టారు.

మంత్రి చొరవతో మరింత ముందుకు..

క్రీడ స్థలం అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని పూర్వ విద్యార్థులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణను కోరగా వెంటనే ఆయన స్పందించడంతో పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిషత్ గ్రాంట్ నుంచి రూ.5 లక్షలు వెచ్చించి పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని వెంటనే అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశించిన వెంటనే మండల స్థాయి అధికారులు సుమారు 50 లారీల పూస కంకర తరలించే ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. దీంతో పాటు నాడు–నేడు పథకం ద్వారా ఇప్పటికే పాఠశాల క్రీడా మైదానం చుట్టూ గోడ కట్టించామని మంత్రి చెబుతూ క్రీడా మైదానం చేర్చి అక్రమంగా వేసిన పాకలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ కూడా ఆదేశాలు జారీ చేశారు. పాకలను తొలగించి పాఠశాల ప్రహరి బయట మొక్కలు నాటి ఆహ్లాదకరంగా మార్చాలని సూచించారు. క్రీడా స్థలం అభివృద్ధికి మంత్రి చెల్లుబోయిన వేణు చొరవ తీసుకోవడంతో పూర్వ విద్యార్థుల్లో ఆనందం నెలకొంది.

క్రీడా స్థలం అభివృద్ధికి చర్యలు



పామర్రు క్రీడా స్థలం విశాలంగా ఉంది. ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉండడం గుర్తించాను. మైదానం అభివృద్ధి చేసి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచే విధంగా చర్యలు తీసుకుంటాను. ఇప్పటికే ఆట స్థలం అభివృద్ధికి రూ.5 లక్షల వరకు మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేశాం. క్రీడా స్థలం మరింత అభివృద్ధి చేసేందుకు నా వంతు సహకారం అందిస్తాను.

– మంత్రి చెల్లుబోయిన వేణు

సీఎం పాలనలో వ్యవసాయానికి పెద్దపీట



తణుకువాడలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపాలెం, శలపాక, తణుకువాడ, అయితపూడి, పల్లిపాలెం గ్రామాల్లో అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ తదితరులు మంగళవారం పర్యటించి పంట పొలాలు, డ్రెయిన్లపై ఏర్పాటు చేసిన క్రాస్‌బండలను పరిశీలించారు. తణుకువాడలో నాగిరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు వ్యవసాయం దండగ అని ప్రకటించి రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. అయితే సీఎం జగన్ మోహన్‌రెడ్డి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ఏ పంటకాలంలో ఆ పంటకు నష్టపరిహారాలు ఇవ్వటం, రైతు భరోసా పథకం ద్వారా ఏటా రైతులు రూ.12,500 చొప్పున ఆర్థిక సహకారం అందించటం, ఆర్‌బీకే కేంద్రాల ద్వారా అధికారులను, ప్రభుత్వ పథకాలను రైతుకు చేరువ చేసి దండగ అన్న వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. నీటి ఎద్దడి నేపథ్యంలో ఏ ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదని సీఎం జగన్ ఇచ్చిన ఆదేశాల మేరకూ రాష్ట్రమంతా పర్యటించి బుధవారం జరుగనున్న రివ్యూ మీటింగ్‌లో ఆయనకు నివేదిక అందజేయనున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా పర్యటన కాస్త ఆలస్యమయిందని అయినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలు నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాలో మిరప, మినుము వంటి పంటలకు నష్టం చేకూర్చినప్పటికీ గోదావరి జిల్లాలో నీటి ఎద్దడిని సరిచేసి వరి పంటకు మేలు చేశాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, ఎంపీటీసీ సభ్యుడు దడాల రమేష్, మంజేరు పీఏసీఎస్ చైర్మన్ గండి కిశోర్, మాత నాగరాజు, కుక్కల బాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత లోపిస్తే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ మధుసూధనరావు
- ఉపాధి పనుల సామాజిక తనిఖీ
- 19 గ్రామాల్లో రూ.8.73 లక్షల విలువైన పనులు



ఉపాధి పనుల రికార్డులు పరిశీలిస్తున్న పీడీ మధుసూదనరావు

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయి ఉపాధి పనుల్లో పారదర్శకత లోపిస్తే, అందుకు బాధ్యులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ, డీపీఓ మధుసూదనరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండలస్థాయి ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ మధుసూదనరావుతో పాటు ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తనిఖీని పర్యవేక్షించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి పాల్గొన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి31 వరకూ చేపట్టిన ఉపాధి పనులపై 14వ విడతగా రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాల వారీగా చేపట్టిన తనిఖీల్లో గ్రామస్తుల సమక్షంలో వెల్లడైన విషయాలను వేదిక ముందు ఎస్‌ఆర్‌పీ బి.దాసు పర్యవేక్షణలో డీఆర్పీలు బి.మహేష్, యు.రాజశేఖర్ వెల్లడించారు. వారి పర్యవేక్షణలో గ్రామ సభల్లో ఆమోదించిన తీర్మానాలను, జమా ఖర్చులను వివరించారు. వాటిని పీడీ మధుసూదన్, ఏపీడీ సత్యనారాయణ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. మండలంలోని 19 గ్రామాల్లో 631 పనులు చేపట్టగా వాటి కోసం వేతనాల రూపంలో రూ.5,20,51,069, మెటీరియల్ రూపంలో రూ.3,52,36,110 మొత్తం రూ.8,72,87,179 ఖర్చు చేశారు. అత్యధికంగా మాచర గ్రామంలో వేతనాల రూపంలో రూ.50,28,212, మెటీరియల్ రూపంలో రూ.48,30,306 మొత్తం రూ.98,58,518 ఖర్చు చేశారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల తీరు, గ్రామ సభల నిర్వహణలపై కోరుమిల్లి మాజీ సర్పంచ్ సలాది వీరబాబు పలు అంశాలను ప్రస్తావించగా పరిశీలిస్తామని తనిఖీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జేఈ వి.సుబ్రహ్మణ్యం, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజయానికి వారధులుగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయానికి గృహసారథులు వారధులుగా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక 28వ వార్డులో మంగళవారం సాయంత్రం కౌన్సిలర్ మొండి భవాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి పాల్గొని పలు సూచనలు చేశారు. గృహ సారథులు తమ పరిధిలోని ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాల ద్వారా వారివారి కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం వారికి చైర్‌పర్సన్ దుర్గారాణి జ్ఞాపికలు అందజేశారు. కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, నీలం దుర్గ, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు మొండి మురళి, జెట్టి బాబురావు, సుంకర పార్వతి, షేక్ అన్సారీ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫస్టియర్ పరీక్షలకు 19 మంది గైర్హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 317 మంది విద్యార్థులను ఎలాట్ చేయగా, కెమిస్ట్రీ 176, కామర్స్ 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు నాగేశ్వరరెడ్డి వివరించారు.

మహిళా వికాసానికి జగన్ ప్రభుత్వం కృషి

'ఆసరా' ఆర్థిక సాయం పంపిణీలో వక్తలు



కేదారిలంకలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి

కపిలేశ్వరపురం: మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. కేదారిలంకలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అధ్యక్షతన మంగళవారం వైఎస్సార్ ఆసరా పథకం ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ లంక గ్రామాల మహిళలు శ్రామిక శక్తి గలవారన్నారు. సర్పంచ్ వీధి వెంకట రెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేదారిలంకలో 86 మహిళా సంఘాల్లోని 760 మంది మహిళలకు రూ. 57.62 లక్షలు, నారాయణలంకలో 22 సంఘాల్లోని 224 మంది మహిళలకు రూ.21.37 లక్షలు మొత్తం 108 సంఘాల్లోని 984 మంది మహిళలకు రూ. 78.99 లక్షలు రుణమాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, సచివాలయ కన్వీనర్లు వీధి గంగాధరరావు, కాశి రామలక్ష్మి, యర్రంశెట్టి నాగేంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా సింహాచలం, కార్యదర్శి కె.నరసింహారావు పాల్గొన్నారు.

కల్వర్టు సమస్యకు చకచకా పరిష్కారం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో యుద్ధప్రాతిపదికన చర్యలు
- తాపేశ్వరంలో మురుగునీటి సమస్యకు తెర



తాపేశ్వరంలో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టిన సిబ్బంది

మండపేట: తాపేశ్వరం పంచాయతీ కార్యాలయం వద్ద శిథిల కల్వర్టు సమస్యకు తెరపడుతోంది. ఇక్కడి మురుగునీటి సమస్యకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో శాశ్వత పరిష్కారానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. తాపేశ్వరం పంచాయతీ సమీపంలోని మెయిన్ డ్రెన్‌పై చాలా ఏళ్ల క్రితం నిర్మించిన తూరల కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. తూములు కుంగిపోవడంతో తరచూ ఇక్కడ మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడి జెడ్పీ హైస్కూల్ వెనుక వైపున, బీసీ ఏరియాలోను మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మురుగునీటిని తోడేందుకు పంచాయతీ సిబ్బంది తరచూ శ్రమించాల్సి వస్తోంది.

ప్రస్తుతం మండపేట–ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్న విషయం విదితమే. పనుల్లో భాగంగా తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగిస్తున్నారు. భారీ వాహనాల తాకిడితో కల్వర్టు చివరన కొంతమేర కుంగిపోయి సమస్య మరింత జఠిలంగా మారింది. రెండు రోజులుగా మురుగునీరు పోయేదారి లేక రోడ్లుపై చేరి ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి సత్వర పరిష్కారానికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. మురుగునీటి ఇబ్బంది లేకుండా పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు మోటార్లు పెట్టి డ్రెన్‌లో మురుగునీటిని తోడిస్తున్నారు.

శాశ్వత పరిష్కారానికి పనులు

రోడ్డు అభివృద్ధి పనుల్లో ఈ డ్రెన్‌పై అధునాతన తూరలతో కల్వర్టు నిర్మించాలి. సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వరమే కల్వర్టు పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ జేఈ సూర్యనారాయణ సోమవారం రోడ్డు నిర్మాణ సంస్థతో మాట్లాడి పనులు చేపట్టారు. గతంలో రెండు అడుగుల తూరలతో నిర్మించిన ఈ కల్వర్టును నూతనంగా 3.3 అడుగుల ఆధునాతన తూరలతో నిర్మించనున్నట్టు తెలిపారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్సీ తోట చొరవతో దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామంలోని ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మెరుగైన సేవలే సొసైటీల లక్ష్యం

ఏడిద, పసలపూడి సొసైటీల మహాజన సభలు



ఏడిదలో శ్రీహరిబాబును సత్కరిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ నాగబాబు

మండపేట: బ్యాంకింగ్ సేవల ద్వారా సొసైటీల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇస్తోందని ఏడిద సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు అన్నారు. రెండేళ్లలో సొసైటీ వార్షికాదాయం రెట్టింపు అయ్యిందన్నారు. ఏడిద సొసైటీ మహాజన సభ చైర్మన్ శ్రీహరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2020–21 ఆర్థిక సంవత్సరంలో సంస్థ వార్షికాదాయం రూ. ఐదు లక్షల వరకూ ఉందన్నారు. ఎరువుల వ్యాపారం, లాకర్స్ సదుపాయం, రైతులకు ఇచ్చే దీర్ఘకాలిక రుణాలను పెంచడం తదితర కార్యాకలాపాల ద్వారా 2021–22 సంవత్సరంలో వార్షికాదాయం రూ. 12.26 లక్షలకు చేరుకోగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.13 లక్షలుగా ఉందన్నారు. సంస్థ సీఈఓ నామాల జగదీష్ మాట్లాడుతూ పంట రుణాలపై ప్రభుత్వం ఇచ్చే 3 శాతం వడ్డీ రాయితీ కింద 448 మంది రైతుల ఖాతాలకు 11.46 లక్షలు జమ చేశామన్నారు. 2023–24 సంవత్సరానికి గాను రూ. 82.25 లక్షలతో ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌ను రైతులు ఆమోదించారు. సొసైటీ చైర్మన్ శ్రీహరిబాబును సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ చిలుకూరి వీరవెంకటసత్యనారాయణ, పార్టీ నేత కుడిపూడి రాంబాబు ఘనంగా సత్కరించారు.

సొసైటీ అభివృద్ధికి అందరూ సహకరించాలి

రాయవరం: సొసైటీ అభివృద్ధికి రైతులు, గ్రామస్తులు సహకరించాలని పసలపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆ సొసైటీ మహాజన సభ మంగళవారం సొసైటీ వద్ద నిర్వహించారు. సొసైటీ ద్వారా జరుగుతున్న వ్యాపార లావాదేవీలను సొసైటీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎస్.రాజారెడ్డి తెలిపారు.2021–22 సంవత్సరపు ఆడిట్ రిపోర్టును మహాజన సభ ఆమోదించింది. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో సొసైటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి మాట్లాడారు. త్రిసభ్య కమిటీ సభ్యులు మెరిపే గమానియేలు, సూలు గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు కర్రి విజేత, కోట శ్రీలక్ష్మి, సంఘ రైతులు కర్రి ఆదిరెడ్డి, మండ గంగిరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి(సత్తిబాబు) పాల్గొన్నారు.